క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గోపవరం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రజా ఫిర్యాదులు (అర్జీలు) స్వీకరించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. అన్నిశాఖల అధికారులు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి హాజరు అవుతున్నందున ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు అర్జీలు ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. అలాగే అధికారులు అందరూ ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాక మొట్ట మొదటిసారిగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం అని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రుణాల రికవరీకి రాజకీయాలకు సంబంధం లేదు

ప్రొద్దుటూరు : కడప డీసీసీబీ జిల్లా పరిధిలో రుణాల రికవరీలో భాగంగా టీమ్స్ ఏర్పాటు చేసినట్లు ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీ డీసీసీ బ్యాంకు మేనేజర్ ఎస్.చెన్నకృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. ఈ బ్రాంచ్ పరిధిలో పెద్ద మొత్తంలో రుణాలు తీసుకున్నవి ఎన్‌పీఏ అయ్యాయని, వీటి వసూళ్ల కోసం పి.టం గుటూరు, చెన్నమరాజుపల్లె, కాకిరేణిపల్లె గ్రామాల్లోని రైతులను కలవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఉద్దేశ్య పూర్వకంగా రామ్మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లలేదని, రుణం రికవరీలో భాగంగానే వెళ్లడం జరిగిందని వివరించారు. రుణాల రికవరీకి రాజకీయాలకు ఏవిధంగా సంబంధం లేదని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ

ప్రొద్దుటూరు : స్థానిక కేవీఆర్ కాలనీలో ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సేవా ట్రస్టు కమిటీని ఎన్నుకున్నారు. శాశ్వత గౌరవ అధ్యక్షులుగా ఆర్.మణిప్రసాద్ రెడ్డి, కె.వెంకటరెడ్డి, శాశ్వత వైదిక ఆగమ సలహాదారులుగా దుర్భాక వెంకట సుబ్బయ్య శర్మ, గౌరవ సలహాదారులుగా హనుమాండ్ల నారాయణ, కేజీ సుధాకర్‌రెడ్డి, ఎస్.విజయభాస్కర్, వై.శ్రీరామిరెడ్డి, అధ్యక్షులుగా టి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా బి.కిశోర్, కార్యదర్శిగా ఆర్.రామాంజనేయరెడ్డి, సహాయ కార్యదర్శిగా వీడీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కోశాధికారిగా వి.విష్ణువర్ధన్, కార్యనిర్వాహక సభ్యులుగా ఎం.శంకరయ్య, సి.సాగర్, వి.కేశవరెడ్డి, బి.గురివిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ ప్రకటించింది.

బాలుడికి ఆర్థిక సాయం



బాలుడి తల్లితండ్రులకు నగదు అందజేస్తున్న ఉపాధ్యాయుడు పట్టెం వెంకటసుబ్బారెడ్డి

అట్లూరు : వింత వ్యాధితో బాధపడుతున్న బాలుడికి తన వంతు ఆర్థిక సహాయం అందించాడు ఓ ఉపాధ్యాయుడు. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని త్యాగరాజ కాలనీకి చెందిన పీరయ్య, కొండమ్మల ఏడు సంవత్సరాల కుమారుడు జనార్దన్ మురుగన్ వింత వ్యాధితో బాధపడుతున్నాడు. అప్పులు చేసి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న విషయం తెలుసుకున్న అట్లూరు మండలం సోమేశ్వరపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యయుడు పట్టెం వెంకటసుబ్బారెడ్డి ఆదివారం బాలుడి తల్లి తండ్రులకు రూ.10 వేలు నగదు అందించాడు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం పొందే విద్యార్థులకు జూలై నెల 1వ తేదీ నుంచి ఉచిత శిక్షణ అందిస్తున్నామని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎల్ఏ సునీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం పట్టణంలోని సీఎస్ఐ చర్చ్ గ్రౌండ్‌లో నాలుగవ తరగతి చదివే విద్యార్థినీ విద్యార్థులకు క్రీడల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పూర్తి వివరాలకు 98497 20930 నెంబర్‌కు సంప్రదించాలని అన్నారు.

సమావేశం 25కు వాయిదా

కమలాపురం : ఈనెల 24న జరుగవలసిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం 25వ తేదీకి కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రాముడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ చైర్ పర్సన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు. 25న ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఇండోర్, ఔట్‌డోర్ సిబ్బంది హాజరు కావాలని ఆయన తెలిపారు.

వానాకాలం.. రోగాలపై సమరం

అసలే వర్షాకాలం, ప్రతి రోజు వానలు, వీధులన్నీ బురదమయం, సైడు కాలువలు, రోడ్ల వెంట దుర్వాసన, రోజుల వ్యవధిలోనే దోమల పునరుత్పత్తి.. సీన్ కట్ చేస్తే.. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ జ్వరాలు విజృంభించడం.. ఊళ్లకు ఊళ్లు మంచం పట్టడం.. ఇలా ప్రతి వర్షాకాల సీజన్‌లో ప్రజలను పట్టిపీడిస్తున్నాయి సీజనల్ వ్యాధులు. ఈ వ్యాధులను కట్టడి చేసేందుకు అధికారులు నడుం బిగించారు. మలేరియా నివారణ మాసోత్సవాల పేరుతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

- దోమల కట్టడితోనే మలేరియా నివారణ
- వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు
- పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి
- ఈ నెల 30 వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నిలిచిన నీటిలో వేస్ట్ ఆయిల్‌ను చల్లుతున్న వైద్య సిబ్బంది

రాజుపాళెం : మలేరియా జ్వరం అంటేనే గ్రామాల్లో చాలామంది వణికి పోతారు. వర్షాకాలంలో దోమల వలన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉండటంతో వైద్య ఆరోగ్య శాఖ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నెల 30 వరకు మలేరియా నివారణ మాసోత్సవాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సంబంధిత అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిశుభ్రత విషయంలో ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు.

దోమల నివారణకు 'డ్రై డే'

దోమల వ్యాప్తిని నిరోధించేందుకు వారానికి ఒక రోజు పరిసరాలను పరిశుభ్రంగా చేయాలనే ఉద్దేశంతో ప్రతి శుక్రవారం ఫ్రైడే – డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నీటి నిల్వలపై దోమలు లార్వా విడిచిపెడతాయి. ఆ లార్వా 8 నుంచి 10 రోజుల వ్యవధిలో గుడ్డుగా మారి తద్వారా దోమగా రూపాంతరం చెందుతుంది. దోమల నివారణకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పరిసరాల్లో ఉన్న చెత్తా చెదారాలను తొలగింపజేయడంతో పాటు మొక్కల కుండీలు, రుబ్బురోళ్లు, రిఫ్రిజిరేటర్లలో ఉన్న నీటి నిల్వలను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సంయుక్త ఆధ్వర్యంలో గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు.

మలేరియా లక్షణాలివే

మలేరియా వ్యాధి ఆడ అనాఫిలిస్ దోమ కాటు వలన వస్తుంది. వర్షాకాలంలో ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉంది. చలి, వణుకుతో పాటు విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, రోజు మార్చి రోజు రెండు, మూడు రోజులకు ఒకసారి జ్వరం వస్తూ ఉంటుంది. మలేరియాలో వైవ్యాక్స్ మలేరియా తక్కువగా బాధిస్తే, ఫాల్సీఫారం మలేరియా ఎక్కువగా బాధించడమే కాకుండా ఒక్కోసారి ప్రాణాంతక స్థాయికి చేరుతుందని వైద్యులు చెబుతున్నారు. చిన్న పిల్లలకు, గర్భిణీలకు ఈ వ్యాధి ప్రమాదకరమైనదని, రక్త పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించుకోవచ్చని పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత పరీక్షలు

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయితే అందుకు అవసరమైన మాత్రలను ఉచితంగా అందిస్తారు. నిర్దేశించిన గడువు ప్రకారం మందులను క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది.

దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- దోమలు రాకుండా ఇంటి కిటికీలు, తలుపులకు మెష్ ఏర్పాటు చేయాలి.
- రాత్రి సమయాల్లో తోమతెరలను వినియోగించుకోవాలి.
- సాయంత్రం నుంచి శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- తాగునీటి నిల్వలపై మూతలు వేయాలి.
- వాడుకలో లేని సామాగ్రిని బోర్లించి ఉంచాలి.
- ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు ఉంటే వేస్ట్ ఆయిల్, కిరోసిన్ పోయాలి.
- ఇంటి పరిసరాల్లో టైర్లు, తాగిపారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు లేకుండా చూడాలి.
- ఇంటి ఆవరణలో దోమ వికర్షణమైన బంతి, తులసి, పుదీనా, లావెండర్, రోజ్ మేరీ వంటి మొక్కలు పెంచుకోవాలి.
- భోజనం చేసేముందు, మలవిసర్జన చేసిన తర్వాత చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి.

దోమల నివారణకు చర్యలు

మండలంలోని కొర్రపాడు గ్రామంలోని కోనేరులో శనివారం దోమల వ్యాప్తిని అరికట్టేందుకు గంబూసియా చేప పిల్లలను వదిలారు. మలేరియా, డెంగ్యూ లాంటి రోగాలను వ్యాపించకుండా ఈ రకమైన చేప పిల్లలను వదిలారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



దోమల కాటు వలన మలేరియా, డెంగ్యూ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ వ్యాధి వ్యాపించడానికి స్థానిక పరిస్థితులు, పరిసరాల శుభ్రతపై ఆధారపడి ఉంటుంది. రక్త మార్పిడి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మలేరియా బాధితుడిని కుట్టిన దోమ మరొకరికి కుట్టడం ద్వారా కూడా మలేరియా సోకుతుంది. సీజన్‌లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాత్రి వేళల్లో దోమతెరలు వాడాలి.

– డాక్టర్ మంజుల, వైద్యాధికారిణి, రాజుపాళెం మండలం

ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నాం



వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దోమల వలన మలేరియా, ఇతర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాం. వ్యాధి నివారణ అనేది మనం తీసుకొనే జాగ్రత్తలపై ఆధారపడి ఉంటుంది. పరిసరాల్లో మురుగునీరు లేకుండా, దోమల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలి. మలేరియాపై సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మలేరియా మాసోత్సవ కార్యక్రమం ద్వారా చైతన్య పరుస్తున్నాం.

– నారాయణ రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి, జమ్మలమడుగు

వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చడం కక్ష సాధింపే

పోరుమామిళ్ల : తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని టీడీపీ ప్రభుత్వం కూల్చడం కక్ష సాధింపు చర్యేనని యువనాయకులు దేవసాని ఆదిత్యారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కరకట్టమీద అక్రమ కట్టడాలు చట్టవ్యతిరేకమని, వానాకాలంలో నీరు పొంగితే ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని అప్పటి జగనన్న ప్రభుత్వం ప్రజావేదిక అక్రమ కట్టడాన్ని కూల్చడం చట్టబద్ధమేనన్నారు.ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కూల్చడం చట్ట విరుద్ధమన్నారు. కోర్టు ఆదేశాలు బేఖాతర్ చేయడం, న్యాయవ్యవస్థమీద గౌరవం లేకుండా వ్యవహరించడం దురహంకార చర్య అని ఆదిత్యారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి 10 రోజులు గడవకుండానే ప్రజాసంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచించకుండా ఇలా చేపట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఆలోచించాలన్నారు. కక్ష సాధింపులుండవని, ప్రతిపక్షానికి తగిన గౌరవమిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పడం కాదని, ఆచరణలో చూపాలన్నారు. ఏది ఏమైనా టీడీపీ చేస్తున్న దాడులు, దురాగతాలకు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆదిత్యారెడ్డి హెచ్చరించారు.

డయేరియాపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

గోపవరం : మండల వ్యాప్తంగా డయేరియాపై ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజ తెలిపారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు పడుతున్నందున తాగు నీరు కలుషితమై డయేరియా ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామ పంచాయతీ, వైద్యశాఖ సిబ్బంది సమన్వయంతో తాగునీటి పథకాలను శుభ్రపరచాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా కూడా మురికినీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయేరియా వ్యాధి ప్రబలితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

తెలుగు సాహిత్య శిఖరం దివాకర్ల వెంకటావధాని



దివాకర్ల వెంకటావధాని చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హనుమంతరావు

బద్వేలు అర్బన్ : తెలుగు సాహిత్య శిఖరం ఆచార్య దివాకర్ల వెంకటావధాని అని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. దివాకర్ల వెంకటావధాని 120వ జయంతి సందర్భంగా ఆదివారం విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశోధకుడుగా, విమర్శకుడిగా పేరు గాంచిన ఆయన తెలుగు సాహితీ రంగానికి చేసిన కృషి అనితర సాధ్యమన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జి.వి.మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించకుంటే ఆందోళనలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీను

బద్వేలు అర్బన్ : పట్టణంలో కొద్ది రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని సీపీఐ పట్టణ కార్యదర్శి కె.శ్రీను పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని పలు కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేయడంతో పాటు పైపులైను లేనిచోట తక్షణమే పైపులైను ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కమిటీ సభ్యులు మోక్షమ్మ, బ్రహ్మయ్య, అనంతమ్మ, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నాగార్జున, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ఇమ్మానియేల్, డీవైఎఫ్ఐ మహిళా కో కన్వీనర్ నాగలక్ష్మి, మహిళా సంఘం నాయకురాలు బాలమ్మ, ఖైరున్‌బీ, సీఐటీయూ పట్టణ కో కన్వీనర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహానికి ముసుగు తొలగించరూ..



కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగు

ప్రొద్దుటూరు : ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులు తాత్కాలిక కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేశారు. ఎన్నికల అనంతరం ఫలితాలు వచ్చి 20 రోజులు దాటినా సంబంధిత అధికారులు ఇంతవరకు వైఎస్ విగ్రహానికి ఉన్న ముసుగును తొలగించలేదు. నియోజకవర్గ పరిధిలోని పలు చోట్ల ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విగ్రహాలకు వేసిన ముసుగులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న చలపతిరావు, అఫ్జల్

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఆల్ ఆఫ్ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చలపతిరావు ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చలపతి రావు మాట్లాడుతూ ఏపీ బీజేపీ ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, నేషనల్ ఐటీ సెల్ కన్వీనర్ డాక్టర్ ఇస్కా సునీల్‌కుమార్ పుట్టిన రోజు సందర్భంగా దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు రాగల రమణయ్య, దివ్యాంగ వలంటీర్లు బావమ్మ, శైలజ, యదార్థుడు, కొండమ్మ, రషీద్, సావిత్రి, నరేష్, చంద్రకళ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్బు తరపున పేదలకు మరిన్ని సేవలు

జమ్మలమడుగు: రోటరీక్లబ్బు ఆధ్వర్యంలో పేదలకు మరిన్ని సేవలను అందించేందుకుగా కృషి చేయడం జరుగుతుందని రోటరీ క్లబ్బు అధ్యక్షుడు న్యాయవాది మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీ డిగ్రీ కాలేజి ప్రాంగణంలో ఉచిత కంటివైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్బు ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచిత కంటి పరీక్షలను చేపట్టి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు సైతం చేయించేబాధ్యత తీసుకోవడం జరుగుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటన చేసి నిరుపేదలకు, వారి పిల్లలకు కావలసిన సౌకర్యాలను సైతం సమకూర్చుతామన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

వల్లూరు: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10: 30 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల అధ్యక్షురాలు అబ్బిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వ్యవసాయం, తాగునీరు, గ్రామీణ ఉపాధి హామీ పథకం, పారిశుద్ధ్యం, విద్య, వైద్య మొదలైన అంశాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల కో ఆప్షన్ సభ్యులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. మండలస్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

డయేరియాపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

గోపవరం : మండల వ్యాప్తంగా డయేరియాపై ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజ తెలిపారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు పడుతున్నందున తాగునీరు కలుషితమై డయేరియా ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామ పంచాయతీ, వైద్యశాఖ సిబ్బంది సమన్వయంతో తాగునీటి పథకాలను శుభ్రపరచాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా కూడా మురికినీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డయేరియా వ్యాధి ప్రబలితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా పౌర్ణమి ఉత్సవాలు



గంగమ్మకు దీపాలతో ఆరాధన చేస్తున్న మహిళలు

జమ్మలమడుగు: పట్టణంలోని కన్నెలూరులో వెలసిన గంగమ్మతల్లికి భక్తులు ఘనంగా పౌర్ణమి ఉత్సవాలను నిర్వహించారు. ఇటీవల 70 సంవత్సరాల తర్వాత గంగమ్మ దేవర నిర్వహించిన గ్రామస్థులు ఏరువాక పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నెలూరులోని శ్రీచౌడేశ్వరిదేవి కోలాట బృందం నృత్యాలు, కోలాటం భక్తులను అలరించాయి.

27న మండల సర్వసభ్య సమావేశం

కమలాపురం: ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఈనెల 27న ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రాదేశిక స్థానాలకు సంబంధించిన ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆమె తెలిపారు. అలాగే అన్ని శాఖలకు సంబంధించిన మండలస్థాయి అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

అంకాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు

సింహాద్రిపురం: మండలంలోని అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకుని బోనాలు పట్టారు. అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు.

ఘనంగా నారీ సశక్తీకరణ దినోత్సవం



మమ్మా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఓంశాంతీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని ఓం శాంతీ భవన్‌లో ఆదివారం బ్రహ్మకుమారి సంస్థ తొలి అధ్యక్షురాలు జగదాంబ సరస్వతీ పుణ్యతిథి సందర్భంగా నారీ సశక్తీకరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓం శాంతి భవన్ నిర్వాహకురాలు బీకే శాంత మాట్లాడుతూ మమ్మా విశ్వశాంతి స్థాపనకు విశేష కృషి చేశారని కొనియాడారు. 28 ఏళ్లపాటు అధ్యక్షురాలిగా ఉండి దేశావ్యాప్తంగా సంస్థ బ్రహ్మకుమారీల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. 600లకు పైగా ఓంశాంతి సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి 900 మందికిపైగా రాజయోగ శిక్షకులతో ప్రచారం చేశారన్నారు. మహిళల పట్ల వివక్షత, చిన్నచూపు ఉండరాదని, వారిని మహా శక్తులుగా చైతన్యపరిచిన మాతేశ్వరిని ప్రతి మహిళా ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముందుగా మమ్మా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జీవన జ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, బ్రహ్మకుమారి సౌజన్య, ఓం శాంతీలు పాల్గొన్నారు.

విద్యకు మించిన ఆస్తి లేదు



ప్రతిభా పురస్కారాలను అందిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వాల్సిన పెద్ద ఆస్తి చదువే అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక బుశెట్టి కల్యాణ మండపంలో ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సీపీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యకు మించిన ఆస్తి ఏది లేదని, తల్లిదండ్రులకు తమ పిల్లలను చక్కగా చదివించి ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని దేశానికి సేవ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ సీపీ సుబ్బారావు, చింతకుంట బాబు, ఆర్యవైశ్య సంఘం గౌరఅధ్యక్షుడు వంకదార వీరభద్రయ్య, న్యాయవాది సీపీ సురేష్, అహోబిళం ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల ఆచార్యులు, ప్రముఖ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెబ్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లో ఉచిత శిక్షణ

మైదుకూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ వెబ్ సెంటర్ ద్వారా వెబ్ డెవలపర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం.రాధారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కూడా చూపుతామని వారు పేర్కొన్నారు. మైదుకూరు మండలంతోపాటు చుట్టుపక్కల ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. వెబ్ డెవలపర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులకు బీకాం, బీఎస్సీ, బీటెక్, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 9440074655, 9701801902, 9398348760 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

• వరిసాగుకు సన్నద్ధం



రెడ్డికొట్టాలలో నారుమడిలో ఎద్దుల కాడితో చదును చేస్తున్న రైతు

కాశినాయన : మండలంలోని రైతులు బోరుబావుల కింద వరిపంటను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. తెలుగుగంగ ఎడమ కాలువ కింద ఉన్న బసనపల్లె, కోడిగుడ్లపాడు, బాలరాజుపల్లె, చెన్నవరం, రెడ్డికొట్టాల గ్రామాల్లోని రైతులు దాదాపు 200 ఎకరాల్లో వరిపంటను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వరి సాగు చేసే పొలాల్లో ప్రభుత్వం రాయితీగా ఇచ్చిన జీలగలు చల్లారు. ప్రస్తుతం వరినారు వేసేందుకు మడులు తయారు చేస్తున్నారు. జూలై నెల చివరి వారం, ఆగస్టు మొదటి వారంలో వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.